కుష్టు నిర్మూలనే లక్ష్యం

- గురువారం నుంచి ప్రారంభమైన ఎల్‌సీడీసీ సర్వే
- ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది
- వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా చికిత్స

ఆలూరు రూరల్: కుష్టు వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా గురువారం నుంచి సర్వే ప్రారంభించారు. లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్‌సీడీసీ) పేరుతో 14 రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమం నేషనల్ లెప్రసీ ఎరాడికేషన్ ప్రోగ్రాం (ఎన్‌ఎల్‌ఈపీ) ఆధ్వర్యంలో ఆగస్టు 2వ తేదీ వరకు కొనసాగుతుంది. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సమగ్రంగా సర్వే నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 74,572 ఇళ్లు ఉన్నాయి.ఇంటింటికీ వెళ్లి ఉన్న జనాభా మేరకు సర్వే ప్రక్రియ కొనసాగుతుంది. నియోజకవర్గంలోని మొలగవల్లి, కమ్మరచేడు, ఆస్పరి, దేవనకొండ, హొళగుంద,హాలహర్వి, గజ్జహళ్లి,హర్దగేరి, చిప్పగిరి పీహెచ్‌సీల పరిధిలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలను 310 టీములుగా ఏర్పాటు చేశారు. ఒక్కో టీములో ఒక ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్త, వైద్య సిబ్బంది మొత్తం ముగ్గురు ఉంటారు. వీరు వారి పరిధిలోని ఇళ్లకు వెళ్లి మచ్చలను పరిశీలిస్తారు. కొత్త కేసులను గుర్తించి వారికి పూర్తిస్థాయిలో వైద్యం అందిస్తారు. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి వైద్యం అందిస్తే అంగవైకల్యం రాకుండా నిరోధించవచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 14 మంది కుష్టు వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు వైద్యాధికారులు వెల్లడించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశానుసారం 10 వేల జనాభాకు ఒక్కరు మాత్రమే కుష్టు వ్యాధిగ్రస్తులు ఉండాలి.





మొలగవల్లి గ్రామంలో కుష్టు వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మొలగవల్లి పీహెచ్‌సీ సిబ్బంది, ఆలూరులో కుష్టు వ్యాధి సర్వే చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

వ్యాధి లక్షణాలు..

- చర్మంపై స్పర్శలేని మచ్చలు
- చెవులపై బుడిపెలు, కణుతులు, నరాల తిమ్మర్లు
- మందమైన మెరిసే జిడ్డుగల చర్మం
- కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం
- కనురెప్పలు మూతపడక పోవడం
- చేతులకు,కాళ్లకు బొబ్బలు రావడం, కాలి చెప్పులు జారిపోవడం
- చేతి,కాలి వేళ్ల వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం
- చల్లని, వేడి వస్తువులను గుర్తించకపోవడం, పాదాల్లో వాపు
- ముక్కు దిబ్బడ, ముక్కు నుంచి రక్తం కారడం

ఉచితంగా చికిత్స..

కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారికి రెండు పద్ధతుల ద్వారా వైద్య సేవలు అందిస్తారు. శరీరంపై మూడు మచ్చలు ఉన్నవారికి పాసివ్ బ్యాసిలరీ (పీబీ) విధానంలో ఆరు నెలలు చికిత్స అందిస్తారు. అలాగే ఐదు మచ్చలు పైబడి ఉన్నవారికి మల్టీ బ్యాసిలరీ (ఎంబీ) విధానంలో 12 నెలలు చికిత్స అందిస్తారు. ఇందులో భాగంగా నెలకు ఒకసారి ఆయా రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య సిబ్బంది మందులు అందజేస్తారు. సర్వేలో గుర్తించిన రోగులకు సకాలంలో వైద్యం అందించడంతో పాటు ఆ వ్యాధిపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తారు. వ్యాధిని సకాలంలో గుర్తిస్తే మెరుగైన వైద్యంతో నివారించవచ్చు. 1987 తర్వాత బహుళ ఔషధ చికిత్స (మల్టీ డ్రగ్ థెరపీ) ద్వారా వ్యాధిని అరికడుతున్నారు. వ్యాధికి అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు ఉచితంగా అందిస్తున్నారు.

సర్వేకు సహకరించాలి



లెప్రసీ వ్యాధిని సకాలంలో గుర్తించి వారికి తగిన వైద్యం అందించాలనే ఉద్దేశంతో వైద్యారోగ్య శాఖ ఆదేశాల మేరకు ఎల్‌సీడీసీ సర్వే చేపట్టాం. ప్రజలందరూ సహకరించాలి. వైద్య సిబ్బంది కూడా ప్రతి ఒక్కరినీ సర్వే చేయాలి. ఎలాంటి లక్షణాలు ఉన్నా వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలి. వ్యాధిని తొందరగా గుర్తిస్తే సకాలంలో తగ్గించుకోవచ్చు. –రవి,డాక్టర్,మొలగవల్లి పీహెచ్‌సీ

కుష్టు నివారణకు కృషి చేయాలి



ఇంటింటి సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది

మద్దికెర : కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేసుకోవచ్చని, నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ వైద్యాధికారిణి రాగిణి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో జరుగుతున్న ఇంటింటి సర్వే పరిశీలించారు. ఆమె వైద్య సిబ్బంది ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటి వద్దకు వచ్చినపుడు ప్రజలు తమ ఆరోగ్యం గురించి పూర్తి సమాచారం ఇచ్చి సర్వేకు సహకరించాలని కోరారు.

కృష్ణగిరి: ఈ నెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే పగడ్బందీగా చేపడుతున్నట్లు మండల వైద్యాధికారి ప్రదీప్ గురువారం తెలిపారు. అన్ని గ్రామాల్లో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు సర్వే చేస్తున్నారని, అనుమానితులకు సంబంధించిన వివరాలను యాప్‌లో నమోదు చేస్తామని చెప్పారు. యాప్‌లో ఉన్న వివరాల ఆధారంగా అనుమానితులకు మరోసారి పరీక్షలు నిర్వహించి గుర్తించిన వారికి ప్రభుత్వం ద్వారా ఉచిత చికిత్స అందించి వ్యాధిని నిర్మూలించడమే లక్ష్యంగా చేపడుతున్నామని వివరించారు.

ఆలూరు: సంపూర్ణమైన ఆరోగ్యాజీవితాన్ని గడపాలంటే దురలవట్లకు దూరంగా ఉండాలని పారామెడికల్ డిప్యూటీ అధికారి గురు ప్రసాద్ ప్రజలకు సూచించారు. మనేకుర్తి, అంగస్కల్లు, ఏ.గోనేహాళ్ తదితర గ్రామాల్లో కుష్ట వ్యాధి నిర్మూలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆస్పరి: మండలంలోని జొహరాపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ మహేంద్ర గురువారం తెలిపారు. ఈనెల 15వ తేదీన కర్నూలులో జరిగిన జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో బాలికల విభాగంలో 10వ తరగతికి చెందిన లతిక, త్రిష, బాలురు విభాగంలో హరికృష్ణ, కార్తీక్ రాణించడంతో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరు ఆగస్టు 10 నుంచి 12వ తేదీ వరకు నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. విద్యార్థులను హెచ్‌ఎం వినయ్ అభినందించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ

మద్దికెర : స్థానిక మద్దమ్మబావి వీధిలో మండల పరిషత్ నిధులతో సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ అనిత, జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి గురువారం భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో సీసీ రోడ్ల పనులు ప్రారంభించామన్నారు. మండల నిధులతో మరిన్ని రోడ్లు వేయడానికి ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ విష్ణు, ఎంపీటీసీలు ఆంజనేయులు, రామకృష్ణ, మాజీ ఎంపీపీ మల్లికార్జున, మాజీ సర్పంచ్ శాంతన్న, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కాజావలి, కిట్టి పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం విడుదల చేయాలి



తహసీల్దార్ బ్యూలాకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

హాలహర్వి: 2023లో పెండింగ్‌లో ఉన్న పంట నష్టపరిహారం సొమ్మును తక్షణమే విడుదల చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆలూరు నియోజకవర్గ కార్యదర్శి బోయ మునిస్వామి డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ బ్యూలాను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇన్‌పుట్ సబ్సిడీని విడుదల చేశారని, అయితే ఎన్నికల కోడ్ కారణంగా నిధులు విడుదల కాలేదన్నారు. ఎన్నికల తర్వాత కొంతమంది రైతుల ఖాతాల్లో మాత్రమే జమ అయ్యాయన్నారు.మిగిలిన రైతులకు జమ కాలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలన్నర రోజులైనా నేటికీ ఆ నిధులను విడుదల చేయకపోవడం సరికాదన్నారు. నాయకులు శివ, అంజి, వీరేష్, మల్లి, శేఖర్, రామంజి పాల్గొన్నారు.

రోడ్డు.. గుంతలమయం



బిణిగేరిలో గుంతలు పడి అధ్వానంగా మారిన ఆర్‌అండ్‌బీ రోడ్డు

ఆస్పరి: మండలంలోని బిణిగేరి గ్రామంలో ఆర్‌అండ్‌బీ రోడ్డ అధ్వానంగా మారింది. గ్రామం నుంచి ఆదోని, ఆస్పరికి వెళ్లే రోడ్డుపై మోకాళ్లోతు గుంతలు పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో గుంతలను గుర్తించలేక ద్విచక్ర వాహనదారులు కింద పడి గాయాలపాలవుతున్నారు. మరమ్మతులు చేయించాలని సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో రోజు రోజుకు గుంతలు మరింత పెరుగుతున్నాయని చెబుతున్నారు.

పంచాయతీ సెక్రటరీకి సన్మానం



రాజశేఖర్‌ను సన్మానిస్తున్న కార్యలయ సిబ్బంది

హొళగుంద: స్థానిక మేజర్ పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్‌ను కార్యలయ సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. రాజశేఖర్ విధుల్లో చేరి ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సిబ్బంది చంద్రశేఖర్‌గౌడ్, పరుశురామ్, వెంకటేష్, వీరభద్ర, చిణిగి తదితరులు ఆయనకు శాలువ కప్పి పూలమాలతో సన్మానించారు.

నియోజకవర్గ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తా

ఆలూరు: ప్రజాసమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి తెలిపారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో గురువారం వైఎస్సార్‌సీపీ మండల కో–కన్వీనర్ వీరేష్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో నెలకొన్న తాగు,సాగునీరు, సీసీరోడ్లు, డ్రైనేజీలు, బీటీ, ఎన్‌హెచ్‌ల మరమ్మతులు తదితర అంశాలపై ఈనెల 22వ తేది నుంచి జరుగనున్న శాసనసభ సమావేశాల్లో ప్రస్తావిస్తానని చెప్పారు. కష్టకాలంలో పార్టీని అంటి పెట్టుకుని పనిచేసినప్పుడే కార్యకర్తలు, నాయకులకు మంచి గుర్తింపు వస్తుందన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. రిటైర్డు తహసీల్దార్ బీసీ మాదన్న, మాజీ సర్పంచ్ సోమేశేఖర్, మరకట్టు ఎల్లప్ప, యార్డు మాజీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జాన్, బాబు, వివిధ గ్రామాల కార్యకర్తలు ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు.



ఆలూరులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి

పచ్చమూకల పిచ్చి చేష్టలు

ఆలూరు: పచ్చమూకల పిచ్చి చేష్టలు కొనసాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలన్నర గడిచినా ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం ఆగలేదు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు మండల కేంద్రమైన హాలహర్విలోని అర్ధగేరి రోడ్డులో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో నిర్మించిన వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ భవనం (రైతు భరోసా కేంద్రం) భవనంపై ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ పేరును తొలగించారు. ఈ దుశ్చర్యపై పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రతినిధులు గురువారం ఖండించారు.



హాలహర్విలో రైతుభరోసా కేంద్రంపై ఉన్న వైఎస్సార్ పేరును తొలగించిన దృశ్యం



నల్లచెలిమలలో పీర్లను నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

ముగిసిన మొహర్రం

దేవనకొండ: మండల కేంద్రంతో పాటు నేలతలమరి, తెర్నేకల్, పి.కోటకొండ, గుండ్లకొండ గ్రామాల్లో మొహర్రం బుధవారం ముగియగా.. నల్లచెలిమల, బుర్రకుంట గ్రామాల్లో గురువారం ముగించారు. ఉదయం నుంచి పీర్లకు ప్రత్యేక ఫాతెహాల్ చేపట్టి గ్రామంలో ఊరేగించారు. సాయంత్రం పీర్లను నిజమజ్జనానికి తరలించారు. పీర్ల ఊరేగింపులో ఆయా గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దేవనకొండ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు

వెల్దుర్తి(కృష్ణగిరి): అర్హులైన రైతులందరికీ కౌలు రైతుల కార్డులు అందిస్తున్నట్లు తహసీల్దార్ ఆనంతాచారి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం కౌలు రైతులకు సీసీఆర్ కార్డులను మండల వ్యవసాయ అధికారి అక్బర్‌బాషాతో కలిసి అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని అర్హులైన రైతుల వీఆర్వోలను కలిసి కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఆర్ఐ మస్తాన్, వీఆర్వోలు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పత్తికొండ రూరల్ : కౌలు రైతులకు కౌలు కార్డులపై అవగాహన అవసరమని మండల వ్యవసాయ అధికారి వెంకట్రాముడు అన్నారు. గురువారం మండలంలోని హోసూరు గ్రామంలో కౌలు రైతులకు కౌలు కార్డుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్డుల ఉపయోగాలను వివరించారు. అనంతరం 27 మందికి కౌలు గుర్తింపు కార్డులు పింపిణీ చేశారు. వీఆర్ఓ తిమ్మయ్య, పంచాయతీ కార్యదర్శి మునిస్వామి పాల్గొన్నారు.

కృష్ణగిరి: అర్హులైన కౌలు రైతులకు సీసీఆర్ కార్డులను అందజేస్తామని ఏఓ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామంలో గురువారం కౌలు రైతుల గుర్తింపు సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 15 రెవెన్యూ గ్రామాల్లోని కౌలు రైతులకు పంటసాగు హక్కు పత్రాలను అందజేస్తామన్నారు. మండలంలో 570 పంటసాగు హక్కు పత్రాలు అందజేయాలని లక్ష్యంగా నిర్దేశించారన్నారు. సీసీఆర్ కార్డుల ద్వారా పట్టాదారుడికి ఎలాంటి నష్టం వాటిల్లదని చెప్పారు. సాగుదారులకు కేవలం పండించిన పంటపై మాత్రమే హక్కు ఉంటుందన్నారు. కార్డులు కలిగిన వారు రాయితీ విత్తనాలు, బ్యాంకు రుణాలు, పంట నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందని వివరించారు. ఏఈఓలు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.



రైతుకు కౌలు కార్డు అందజేస్తున్న అధికారులు

గుండమ్మ కుటుంబానికి రక్షణ కల్పించాలి

ఆదోని రూరల్: హత్యకు గురైన మాదిగ గుండమ్మ కుటుంబానికి ప్రాణ రక్షణ కల్పించాలని దళిత ప్రజా సంఘాల కన్వీనర్ రామతీర్థం అమ్రేష్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నాగనాథనహళ్లి గ్రామస్తులతో పాటు సుమారుగా 200 మంది ఆదోని పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి సత్యం టాకీస్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేసి, సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మకు వినతి పత్రం అందించారు. దళిత ప్రజా సంఘాల నాయకులు, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నాయకులు అమ్రేష్ మాదిగ, బీఎస్పీ రాష్ట్ర నాయకులు మంచాల లక్ష్మీనారాయణ, మాలమహానాడు రాయలసీమ అధ్యక్షుడు నరసప్ప, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు హెబ్బటం రాజు మాట్లాడుతూ నాగనాథనహళ్లి గ్రామంలో మాదిగ కులస్తులు అభద్రతాభావానికి లోనై భయాందోళనకు గురవుతున్నారన్నారు. తక్షణమే ఆ గ్రామంలో, మాదిగ కాలనీలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలన్నారు. అరెస్టు చేసిన ముద్దాయిలను జిల్లా బహిష్కరణ చేసి గుండమ్మ కుమారుడు కిషోర్ ప్రాణాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో జైభీమ్ యువత మారెప్ప, బీఎస్పీ ఆలూరు ఇన్‌చార్జ్ రామలింగ, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా మహిళా అధ్యక్షురాలు కదిరికోట బతుకమ్మ, సుమాల చార్లెస్, ప్రసన్నకుమార్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాసంఘాల నిరసన ర్యాలీ

హెల్మెట్ ధరించండి

పత్తికొండటౌన్: ప్రమాదాల నివారణకు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జూనియర్ సివిల్ జడ్జి ఎంఎస్.భారతి సూచించారు. గురువారం పట్టణంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు స్థానిక కోర్టు నుంచి పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోర్టు వద్ద ర్యాలీని జడ్జి భారతి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు అధికంగా తలకు గాయాలై మరణాలు సంభవిస్తున్నాయని, వాటి నివారణకు హెల్మెట్ ధరించాలని కోరారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేసే వాహనదారులకు నూతన చట్టాల ప్రకారం అధిక మొత్తంలో జరిమానా విధిస్తారని స్పష్టం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి, ప్రధాన కార్యదర్శి మహేశ్, ఏజీపీ నరసింహయ్య, ఎస్ఐ వెంకటేశ్వర్లు, న్యాయవాదులు ఎల్లారెడ్డి, రమేశ్‌బాబు, కృష్ణయ్య, ప్రసాద్‌బాబు, మధుబాబు, అరుణ్‌కుమార్, దామోదర ఆచారి, అశోక్‌కుమార్, సూరజ్, వీరేశ్, నెట్టేకల్లు, హరి, చంద్రశేఖర్, లోక్‌అదాలత్ సిబ్బంది రమణమ్మ, ప్రసాద్ పాల్గొన్నారు.



పత్తికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న జడ్జి భారతి, న్యాయవాదులు

ఆలూరు రూరల్: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని ఆలూరు మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించకపోతే ప్రమాద సమయంలో ప్రాణాపాయానికి అధిక అవకాశముందని, హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. న్యాయవాదులు హెచ్‌కే రవి, రాజేష్ నాయుడు, ప్రసాద్, సీఐటీయూ జిల్లా నాయకుడు నారాయణస్వామి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మండల లీగల్ సర్వీస్ కమిటీ సభ్యులు

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

మద్దికెర : వర్షాలు పడుతుండడంతో పారిశుద్ధ్య లోపంచి దోమలు వ్యాప్తి చెంది సీజనల్ రోగాలు ప్రబలే ప్రమాదముందని మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి అన్నారు. గురువారం మండల కేంద్రంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో చెత్త నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలని, మురుగు, రద్దీ ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని సూచించారు. ఇన్‌చార్జి కార్యదర్శి విజయ్ ఉన్నారు.

24న రోప్ స్కిప్పింగ్ పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక బి.క్యాంపు బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 24న ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ కార్యదర్శి అబ్దుల్ రెహమాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు 10, 12, 14, 17, 19 సంవత్సరాల్లోపు బాల బాలికలకు వేర్వేరుగా ఉంటాయని వెల్లడించారు. జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసి రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ప్రవేశ రుసుం రూ.20, వయస్సు ధ్రువీకరణ పత్రంతో పాటు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు 99492 57657 సెల్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

నాటుసారా స్థావరంపై దాడులు



బెల్లంఊటను పారబోస్తున్న సెబ్ పోలీసులు

ఆదోని రూరల్: పట్టణ శివారులోని సింగరాయి కొండల్లోని నాటుసారా స్థావరంపై సెబ్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. కొండ గుట్టల వద్ద రెండు స్థావరాల్లో 1700 లీటర్ల బెల్లం ఊట, 30 లీటర్ల నాటుసారాని ధ్వంసం చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎస్.రవికుమార్ తెలిపారు. స్థావరం నిర్వహిస్తున్న వ్యక్తులు పరారైనట్లు చెప్పారు. వారిని త్వరలోనే పట్టుకుంటామన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించండి

పెద్దకడబూరు: రైతులు వ్యవసాయాధికారులు సూచించే యాజమాన్య పద్ధతులు పాటించి మంచి దిగుబడులు సాధించాలని ఆదోని వ్యవసాయ సహాయ సంచాలకులు అరుణకుమారి సూచించారు. మండల పరిధిలోని తారాపురం గ్రామంలో రైతులు సాగుచేసిన నూతన వేరుశనగ రకం (వశిష్ట) పంటలను మండల వ్యవసాయ అధికారి ఎం.వరప్రసాద్‌తో కలసి గురువారం పరిశీలించారు. రైతులకు జిప్సమ్ వాడుక గురించి అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక రైతుసేవా కేంద్రంలో నిలువ ఉంచిన ఎరువులను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. మండల పరిధిలోని నౌలేకల్లు గ్రామంలోని రైతుసేవా కేంద్రంలో రైతులకు కౌలు పత్రం గురించి అవగాహన కల్పించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కృష్ణగిరి: అతిసార, డెంగీ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల నోడల్ అధికారి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిణి వెంకటలక్ష్మమ్మ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా తాగునీటి లీకేజీ వల్ల వచ్చే అతిసార వ్యాధి ప్రాణాంతకరమైందన్నారు. అలాగే దోమల వల్ల వచ్చే డెంగీ కూడా అంతే ప్రమాదకరమని వీటి గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యాధులు ప్రబలినప్పుడు వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో సంప్రదించి చికిత్స పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీటిపై అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పంచాయతీ, వైద్య అధికారులు గ్రామాల్లో తాగునీటి క్లోరినేషన్‌ను క్రమం తప్పకుండా చేయించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్, తహసీల్దార్ అనురాధ, వైద్యాధికారి ప్రదీప్, ఈఓఆర్డీ మురళీమోహన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎంపీపీ కారు ధ్వంసం

చిప్పగిరి: ఎంపీపీ జటూరు హేమలత కారు అద్దాలను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు ఆమె భర్త వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు మారయ్య గురువారం తెలిపారు. ఎంపీపీ తన కుటుంబంతో కలిసి అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణంలోని ధర్మవరం గేట్ సమీపంలో నివాసం ఉంటున్నారు. బుధవారం రాత్రి ఎవరూ లేని సమయంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కారు అద్దాలను పగులగొట్టారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విరూపాక్షి గురువారం ఎంపీపీ ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆస్తులు ధ్వంసం చేయడం, నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడటం మంచి సంస్కృతి కాదన్నారు. కొందరు టీడీపీ నాయకుల ప్రోద్బలంతోనే ఇలాంటి దాడులు చోటు చేసుకుంటున్నాయని మండిపడ్డారు. గుంతకల్లు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



ధ్వంసమైన కారును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ఘనంగా గ్యారతారీఖ్ వేడుకలు



స్వామి వారి సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న ధర్మకర్త

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో గురువారం గ్యారతారీఖ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. స్వామి వారం గురువారంతో పాటు మొహర్రం పండుగ మరుసటి రోజే గ్యారతారిఖ్ వేడుకలు రావడంతో దర్గాకు భక్తులు అధికంగా తరలి వచ్చారు. అంతకు ముందు తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు. చాల మంది భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు. భక్తులందరికీ ధర్మకర్త అన్నదానం ఏర్పాటు చేశారు.

ఘర్షణ.. ఇరువర్గాలపై కేసు నమోదు

ఆదోని అర్బన్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు ఘర్షణకు దిగడంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ నరసింహరాజు తెలిపారు. బుధవారం మండలంలోని సలకలకొండ గ్రామంలో పీర్లదేవుళ్ల వేడుకల్లో ఇరువర్గాల మధ్య గొడవ జరిగిందన్నారు. గురువారం వారు ఫిర్యాదు చేయడానికి తాలూకా పోలీస్‌స్టేషన్‌కు వచ్చారని, మాటామాటా పెరగడంతో పరస్పరం దాడులు చేసుకున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టీడీపీకి చెందిన పది మందిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే టీడీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు 9 మంది వైఎస్సార్‌సీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అయితే వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లేష్‌ను కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేయడంతో టీడీపీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

మట్కా బీటర్ల అరెస్ట్

ఆదోని అర్బన్: స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ సమీపంలో ఏడుగురు మట్కా రాస్తున్న బీటర్లపై టూటౌన్ పోలీసులు గురువారం దాడి చేశారు. వారి నుంచి రూ.13 వేల నగదు, మట్కా చీటీలు స్వాధీనం చేసుకున్నారు. భోగేష్‌తో పాటు మరో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

20న 'భువన విజయం' ప్రదర్శన

కర్నూలు కల్చరల్: శతావధాని బ్రహ్మశ్రీ గండ్లూరి దత్తాత్రేయ శర్మ బృందంచే ఈ నెల 20వ తేదీ సాయంత్రం 6 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో 'భువన విజయం' సాహిత్య రూపకం ప్రదర్శిస్తున్నట్లు సాహితీ సదస్సు వ్యవస్థాపకులు కురాడి చంద్రశేఖర కల్కూర తెలిపారు. సాహితీ సదస్సు స్థాపకులు, ఉస్మానియా కళాశాల విశ్రాంత ఆచార్యులు ఎస్వీ కృష్ణమూర్తి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్, క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్, అఖిల భారతీయ బ్రాహ్మణ కరివేన నిత్యాన్నదాన సత్రం కార్యదర్శి డాక్టర్ ఎస్.వేణుగోపాల్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.